క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లి: కమ్మనపల్లె బాలికల గురుకుల పాఠశాల 2025–2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి 5, 6, 7, 8వ తరగతులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శోభ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 31వ తేదీలోపు httpr://aprr.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్షను ఏప్రిల్ 25న చిత్తూరు జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఎస్‌డీపీఐ నిరసన ర్యాలీ

పుంగనూరు: ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షుడు ఎంకె.ఫైజీని ఢిల్లీలో ఈడీ అరెస్ట్ చేయడంపై స్థానిక ఎస్‌డీపీఐ నేతలు నిరసన ర్యాలీ చేశారు. బుధవారం పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో పార్టీనేతలు, కార్యకర్తలు సమావేశమై ర్యాలీ నిర్వహించారు. మనీలాండరింగ్ కింద తప్పుడు కేసులు నమోదు చేసి, కేంద్ర ప్రభుత్వం ఫైజీని అరెస్ట్ చేసిందని ఆరోపించారు. ఆయన అరెస్ట్‌ను ఖండిస్తున్నామని, తక్షణమే విడుదల చేయాలని లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పీహెచ్‌సీ తనిఖీ


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సుధారాణి బుధవారం తనిఖీ చేశారు. వైద్యపరమైన అన్ని రికార్డులు, సర్వేలను ఆమె చూశారు. ముఖ్యంగా సర్వేలకు సంబంధించి వైద్య సిబ్బంది చేయాల్సిన పనులను ఆశావర్కర్లకు అప్పగించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదని హెచ్చరించారు. వైద్యసిబ్బంది చేపట్టాల్సిన సర్వేలను ఇకపై వారే చేయాలని ఆదేశించారు. డీపీఎంఓ ప్రవళ్లిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు రైతులను ఆదుకోవాలి

పలమనేరు: పలమనేరు ప్రాంతంలోని పట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇప్పటిదాకా పట్టుగూళ్ల రైతులకు సంబంధించి ఇన్‌సెంటివ్ రూ.20 కోట్ల దాకా రావాల్సి ఉందని దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గతంలో పట్టుశాఖ రైతులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలను కొనసాగించాలని కోరారు.

నోటీస్ బోర్డు

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

శాంతిపురం: వివిధ రెవెన్యూ సేవలను అందించేందుకు సిబ్బంది లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని శాంతిపురం తహసీల్దార్ శివయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాత పూర్వకంగా లేదా తమ కార్యాలయంలోని ఫిర్యాదుల పెట్టి, లేదా కింది నంబర్లకు ఫోన్‌కాల్/ వాట్సాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్	:	1400/1064
తహసీల్దార్, శాంతిపురం	:	7382073939
ఆర్డీఓ కుప్పం	:	9491074513
కడ పీడీ	:	9281448309
జిల్లా కలెక్టర్, చిత్తూరు	:	9491077001

నీళ్లు కట్.. షాపులు సీజ్


పుంగనూరులో షాపులు సీజ్ చేస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి


కల్యాణ మండపానికి కొళాయిలు కట్ చేయిస్తున్న కమిషనర్

- పన్ను బకాయిదారులపై కొరడా
- ఝుళిపిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్ను సకాలంలో చెల్లించకుండా బకాయిలు ఉన్న యజమానులకు మున్సిపాలిటీ షాక్ ఇచ్చింది. బుధవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి స్వయంగా బకాయిల వసూళ్లకు రంగంలోకి దిగారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న రిటైర్డ్ ఉద్యోగి వెంకటసుబ్బయ్య షాపులు సీజ్ చేసి, నీటి కొళాయిలు కట్ చేశారు. అలాగే కృష్ణారెడ్డికి చెందిన కల్యాణ మండపానికి నీటి కొళాయిలు కట్ చేశారు. అలాగే మూడు షాపులు సీజ్ చేసి, ఐదుగురికి చెందిన నీటి కొళాయిలు కట్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 2,020 నుంచి బకాయిదారులందరికీ పలుమార్లు పన్నులు చెల్లించాలని కోరినా ఫలితం లేదన్నారు. ఐదేళ్ల బకాయిలు చెల్లించకుండా ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి, చర్యలు చేపట్టామన్నారు. 7 రోజుల్లోపు ఆస్తిపన్ను, నీటి పన్ను చెల్లించాలన్నారు. బకాయిల జాబితాను పత్రికలకు విడుదల చేసి, వారికి మున్సిపల్ సేవలు బంద్ చేస్తామన్నారు. అలాగే బకాయిదారులకు చెందిన షాపులు, మండపాలు, లాడ్జీలు, స్కూళ్లు, కాంప్లెక్స్‌లు పట్టణంలో సీజ్ చేస్తామన్నారు. వీటితో పాటు గృహాలకు నీరు కట్ చేస్తామన్నారు. నిబంధనల మేరకు ప్రతిఏటా చెల్లించాల్సిన పన్నులను చెల్లించకుండా మున్సిపాలిటీ అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ యజమానులు బాధ్యతగా తీసుకుని పన్నులు చెల్లించాలని, ఇందులో ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కమిషనర్ హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐలు నరేంద్రరాజు, నాగరాజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, సంబంధిత సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసూలు కానీ పన్నులు..

మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలకు సంబంధించి, నీటి పన్నులు కలిపి మొత్తం డిమాండ్ రూ.9.16 కోట్ల రూపాయలు ఉంది. ఇందులో రూ.4.06 కోట్ల వసూలైంది. మిగిలిన రూ.3.01 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అలాగే నీటి పన్ను రూ.2.09 కోట్లు ఉండగా అందులో రూ.98 లక్షలు మాత్రమే వసూలైంది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 31 భవనాలు అందుబాటులో ఉన్నాయి. వీటి డిమాండ్ రూ.55 లక్షలు ఉంది. ఇందులో కేవలం రూ.11లక్షలు మాత్రమే వసూలైంది. కేంద్ర కార్యాలయాలు పూర్తిగా చెల్లించారు. రాష్ట్ర కార్యాలయాలు పన్ను చెల్లించాల్సి ఉంది.

పుదిపట్లలో ఫుడ్ కమిషన్ చైర్మన్


పుదిపట్ల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి


లీనార్డ్ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి బుధవారం సందర్శించారు. పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజన శాలను తనిఖీ చేసి వంట నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజన నిర్వహణ తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచి చూశారు. నవంబర్ నెల నుంచి వంట నిర్వాహకులకు బిల్లులు చెల్లించలేదని ఆయన దృష్టికి తెచ్చారు. విద్యా వ్యవస్థ ఇతర అంశాలపై విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. లద్దిగం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంఈఓ కేశవరెడ్డి, హెచ్‌ఎం పద్మజ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పుంగనూరు: సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను వెంటనే అధికారులతో చర్చించి, పరిష్కరిస్తామని, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారం ఎంతో బాగుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని లీనార్డ్ హైస్కూల్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజన పథకాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టళ్లలో బిల్లుల బకాయిల సమస్యను పరిష్కరిస్తామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించారు. ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి పాల్గొన్నారు.

కోడి పందేల రాయుళ్ల అరెస్టు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ తిరుమణపల్లె సమీపంలోని దోసెలకుంట వద్ద కోడి పందెం నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు చేసి, కోడి పందేలు ఆడుతున్న వెంకటరమణ, రామకృష్ణ, భరత్‌కుమార్, గంగరాజులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.8,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి




అవగాహన కల్పిస్తున్న అధికారులు, హాజరైన మహిళలు

వి.కోట: ఈస్ట్‌మెన్ గార్మెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో వెలుగు గ్రూపు మహిళలకు కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఉన్న కల్యాణ మండపంలో మండల వెలుగు స్వయం సహాయ సంఘాల మహిళలకు గార్మెంట్స్ సంస్థ కల్పించే ఉపాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. లేబర్ ఆఫీసర్ పద్మ, ఏపీఎం లావణ్య పాల్గొన్నారు.

చోరీ వస్తువుల రికవరీ


సిలిండర్లు, బ్యాటరీలను చూపుతున్న సీఐ

గంగవరం: మండలంలో నాలుగు రోడ్ల వద్ద ఎస్‌ఈజెడ్ పరిధిలోని పలు షాపుల్లో గతంలో చోరీకి గురైన సిలిండర్లు, వాహనాల బ్యాటరీలను రికవరీ చేసినట్టు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. తరచూ అక్కడి హోటళ్లలోని గ్యాస్ సిలిండర్లు, నిలబెట్టిన వాహనాల బ్యాటరీలు చోరీకి గురవుతున్నట్టు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తి నుంచి వస్తువులను రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. వాటిని బాధితులకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి చోరీలు పునరావృతం కాకుండా పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థను బలపరిచినట్టు ఆయన తెలిపారు.

పట్టపగలే దొంగలు పడ్డారు


పగులగొట్టిన ఇంటి తాళం

వి.కోట: పట్ట పగలే ఇంట్లో చొరబడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకువెళ్లిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. వి.కోట మండలంలోని నాయకనేరి కొత్తూరు గ్రామానికి చెందిన భూపాల్ నాయుడు, ఆయన కుటుంబసభ్యులు ఇతర పనుల నిమిత్తం పక్క గ్రామానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించిన గ్రామస్తులు ఆ విషయం కుటుంబ యజమానికి తెలిపారు. భూపాల్ కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా భూపాల్ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి, బీరువాలో ఉంచిన దాదాపు రూ.50 వేల నగదు, 16 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మదర్‌థెరిసా కళాశాల ఎంఓయూ


ఎంఓయూ చేసుకుంటున్న యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలోని (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ స్టేట్ సైన్స్) విభాగం వారు కుప్పంలోని వాల్ట్ స్పియర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నట్టు కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. ఎంఓయూ వల్ల తమ కళాశాలలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు అధునాతన సాంకేతిక అంశాలపై శిక్షణ పొందేందుకు వివిధ అంశాలపైన ప్రాజెక్టులు, మినీ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కుప్పం కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించండి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అప్పోజి

శాంతిపురం: చిరు, పప్పు ధాన్యాల సాగు చేసే రైతులు పంట నూర్పిడిలో తగిన మెలకువలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడితో అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. బుధవారం ఆయన అబకలదొడ్డిలోని రైతు సమాచార కేంద్రంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటల్లో కోత తర్వాత తగు జాగ్రత్తలు తీసుకోకపోతే నష్ట తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పనిముట్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

భవిత కేంద్రం తనిఖీ


మాట్లాడుతున్న విజయ్‌ప్రకాష్

పలమనేరు: మండలంలోని భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ విజయ్‌ప్రకాష్‌నాయుడు బుధవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంఈఓ బాలసుందరం, ఐఈఆర్పీ మంగేశ్వరి, సిబ్బంది మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న సిబ్బంది

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాలపై స్థానిక మున్సిపల్ అధికారులు బుధవారం ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై దాడులు నిర్వహించారు. ఆమేరకు ప్లాస్టిక్ కవర్ల విక్రేతలకు రూ.5,400వేల దాకా జరిమానా విధించినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. దాడుల్లో మున్సిపల్ శానిటరీ శాఖ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏడాదిలో స్వర్ణ కుప్పం పూర్తి చేస్తాం

– కడా పీడీ వికాస్ మర్మత్


మాట్లాడుతున్న కడా పీడీ

కుప్పం: కుప్పం పట్టణాన్ని ఆధునీకరణ వసతులతో ఏడాది వ్యవధిలో స్వర్ణకుప్పంగా పనులు పూర్తిచేస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం కడా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్న విధంగా కుప్పం పట్టణాన్ని స్వర్ణకుప్పంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికీ 20 శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన 80 శాతం పనులను ఏడాదిలోపు పూర్తి చేసి కుప్పాన్ని స్వర్ణకుప్పంగా మారుస్తామని తెలిపారు. దీంట్లో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో నివేదికలు తయారు చేశారన్నారు. గండికోట నుంచ ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా కుప్పానికి నీరు తీసుకొచ్చి శాశ్వత తాగునీటి సరఫరాకు శ్రీకారం చుడుతామన్నారు. ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.53 కోట్లతో రోడ్లు పనులు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. శాంతిపురం వద్ద మదర్ డెయిరీ పరిశ్రమ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, దీని ద్వారా నియోజకవర్గంలో 2వేల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మే నుంచి ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు.

పోస్ట్‌మన్ సేవలు ఆదర్శనీయం


కృష్ణమూర్తి దంపతులను సత్కరిస్తున్న పెద్దిరెడ్డి, నిసార్ అహ్మద్

చౌడేపల్లె: స్థానికంగా పోస్ట్‌మన్‌గా 44 ఏళ్ల పాటు సేవలందించిన కృష్ణమూర్తి సేవలు ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కొనియాడారు. బుధవారం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగిన కృష్ణమూర్తి పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. ఆయన మండల ప్రజలకు పోస్టల్ శాఖ ద్వారా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు సాధిక్‌బాషా పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. వైద్యశిబిరానికి ఎంఎన్ కంటి ఆస్పత్రి చైన్నై నుంచి ప్రముఖ కంటి వైద్యనిపుణులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బంగాళాదుంప తెంచింది..!


కురప్పల్లి వద్ద బంగాళాదుంప సాగు


ఒబ్బిడి చేసిన బంగాళాదుంపలు

- గిట్టుబాటు కాని ధరలు
- నష్టాల బాటలో దుంప రైతులు
- ఐదు రాష్ట్రాల నుంచి భారీగా వస్తున్న సరుకు

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో మాత్రమే సాగయ్యే పంట బంగాళాదుంప. ఇక్కడి శీతల వాతావరణం కారణంగా, ఎర్రటి నేలలతో ఈ పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు ఏటా ఆలుగడ్డను ఎంతో ఆసక్తిగా సాగు చేస్తుంటారు. బంగాళాదుంప సాగులో లక్షాధికారులైన రైతులు ఈ ప్రాంతంలో ఉన్నారు. కానీ ఈ దఫా బంగాళాదుంపను సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పలేదు. పంట చేతికొచ్చే సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి బంగాళాదుంపలు మార్కెట్లకు చేరడంతో ఉన్నట్టుండి ధరలు అమాంతం తగ్గాయి. దీంతో లక్షలు పెట్టుబడిగా పెట్టిన రైతులకు ఈ దఫా నష్టాలు తప్పలేదు.

బంగాళాదుంప సాగు ఈ దఫా తగ్గినా....

ఏటా ఈ ప్రాంతంలో నవంబర్, జనవరి నెలల్లో బంగాళాదుంపను సాగుచేస్తుంటారు. పంట ఒబ్బిళ్లు తొలి అదును పంట జనవరిలో రెండో అదును పంట మార్చిలో జరుగుతుంది. ఏటా ఇక్కడి సాధారణ సాగు 2,650 హెక్టార్లు కాగా ఈదఫా 1,500 హెక్టార్లలో మాత్రమే సాగుచేశారు. ఇందుకు కారణం గతేడాది సైతం దుంపకు ధరలు రాక రైతులు నష్టాలబాట పట్టారు. దీంతో ఈదఫా భయపడి చాలామంది రైతులు పంటను సాగుచేయలేదు. అయితే ఒకే దఫా బంగాళాదుంపను సాగు చేసే ప్రధాన రాష్ట్రాల నుంచి సరుకు రావడంతో స్థానిక రైతులకు ధర లేకుండా పోయింది.

పంట పెట్టుబడి, రైతు కష్టం మిగలకపోయె...

ఎకరాపొలంలో దుంపకు పంట పెట్టుబడిగా విత్తనం 15 బస్తాలు (బస్తా రూ.4వేలుగా) రూ.60వేలు, కోడి ఎరువు రూ.25వేలు, కాంప్లెక్స్ ఎరు రూ.15వేలు, క్రిమిసంహారక దులకు రూ.20వేలు, కూలీలు, ట్రాక్టర్ ఖర్చు, గడ్డ తొవ్వడం కోసం రూ.40వేలు మొత్తం రూ.1.60 లక్షలు అవుతోంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరానికి 200 బస్తాలు (బస్తా 42 కేజీలు) దిగుబడి వస్తుంది. ప్రస్తుతం బస్తా ధర రూ.800గా ఉంది. దీంతో రాబడి రూ.1.60లక్షలుగా ఉంటే రైతు పెట్టిన ఖర్చు రూ.1.60లక్షలుగానే ఉంది. దీంతో రైతులు పంట పెట్టుబడి కూడా దక్కకపోగా ఆరుగాలం కష్టపడిన ఆరైతు కుటుంబం కష్టం నేలపాలైంది.

భారీగా చెన్నై మార్కెట్‌కు సరుకు..

ఈప్రాంతంతో పండించే ఆలుగడ్డలను చెన్నై మార్కెట్‌కు రైతులు తరలిస్తుంటారు. గతంలో బస్తా రూ.2వేల దాకా ధర పలికిన సందర్భాలున్నాయి. అయితే ఈదఫా నాణ్యమైన సరుకు బస్తా ధర రూ.800 మాత్రమే. ఇక నాణ్యత తక్కువగా ఉన్న సరుకు బస్తా రూ.500 దాకానే ఉంది. దేశంలో ఎక్కువగా బంగాళాదుంపను సాగుచేసే రాష్ట్రాల్లో పంజాబ్, హరియానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలున్నాయి. ఈ సీజన్‌లో అన్ని రాష్ట్రాల్లోనూ భారీగా పంట సాగు పెరిగింది. దీంతో చెన్నై మార్కెట్‌కు ఐదు రాష్ట్రాల నుంచి సరుకు ఎక్కువగా వస్తోంది. దీంతో ధరల పతనానికి కారణమైందని బంగాళాదుంప వ్యాపారులు చెబుతున్నారు.

ఐదుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులో ఐదుగురిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కైలాసపురం వద్ద ఓ గోదాములో 5 టన్నుల వరకు రేషన్ బియ్యాన్ని దాచి స్మగ్లింగ్ చేస్తుండటంపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. ఈ ఘటనలో పెద్ద పంజాణి మండలం రాయల్‌పేటవాసి వెంకటరమణ (28), అమర్‌నాథ్ (25), బైరెడ్డిపల్లెకు చెందిన జగన్నాథం (30), చిత్తూరుకు చెందిన ముత్తు (24), జానకారపల్లెకు చెందిన మహేష్ (37)ను పోలీసులు అరెస్టు చేశారు.